
విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీఎస్ ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు

## మాదిగల శత్రువులు.. కాంగ్రెస్, బీజేపీ

**ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజేశ్ ఖన్నా**

నయీంనగర్, నవంబర్ 16: ఎస్సీ వర్గీకరణ చేయకుండా మాదిగ యువకుల ప్రాణాలను బలి తీసుకున్న కాంగ్రెస్ పార్టీ, వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామంటూ మాదిగలను మోసం చేసిన బీజేపీలకు మాదిగలు, మాదిగ ఉపకులాల శత్రువులని టీఎస్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజేశ్ ఖన్నా అన్నారు. ప్రశాంత్‌నగర్‌లోని ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేశ్ నివాసంలో గురువారం ఆయన గెలుపు కోసం ఎమ్మార్పీఎస్ టీఎస్ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం 28 ఏండ్లుగా ఎమ్మార్పీఎస్ పోరాడుతుంటే కాంగ్రెస్, బీజేపీ మోసం చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వర్గీకరణ కోసం అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేయించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి అరూరి రమేశ్‌ను లక్ష మెజార్టీతో గెలిపించేందుకు ఎమ్మార్పీఎస్ టీఎస్ కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేడ స్వామి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు నమిండ్ల చిన్నస్వామి, జిల్లా అధికార ప్రతినిధి తాళ్లపల్లి ప్రశాంత్, పోగుల రాకేశ్, కట్టెపోగుల ప్రశాంత్, జన్ను సంజీవ్, ప్రతాప్, జోసెఫ్, మధు, టోనీ, తిరుపతి, అనిల్ కుమార్, సురేశ్, జయరాజు, శంకర్ పాల్గొన్నారు.


టేకులతండాలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ, నాయకులు

## బీఆర్ఎస్ పాలనలోనే తండాలకు మహర్దశ

వర్ధన్నపేట, నవంబర్ 16: బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే గిరిజన తండాలకు మంచి జరిగిందని వర్ధన్నపేట ఎంపీపీ అన్నమనేని అప్పారావు అన్నారు. మండలంలోని టేకులతండాలో జడ్పీటీసీ మార్గం భిక్షపతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, పార్టీ ముఖ్యనాయకులతో కలిసి మండలంలోని టేకులతండాలో బీఆర్ఎస్ అభ్యర్థి అరూరిని గెలిపించాలని కోరుతూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గిరిజనతండా గ్రామ పంచాయతీలుగా మార్చారని తెలిపారు. గిరిజనులు మరింత ప్రగతి సాధించాలంటే బీఆర్ఎస్ ప్రభుత్వం మరోసారి రాష్ట్రంలో అధికారంలోకి రావాలన్నారు. వర్ధన్నపేట పట్టణంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ స్వామిరాయుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోత్ అరుణ, వైస్‌చైర్మన్ ఎలేందర్‌రెడ్డి, కౌన్సిలర్ రాజమణి పాల్గొన్నారు.


భగత్‌సింగ్ కాలనీలో ప్రచారం చేస్తున్న డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్

## ‘అరూరి’ని భారీ మెజార్టీతో గెలిపించాలి

హసన్‌పర్తి/కాశీబుగ్గ, నవంబర్ 16: గ్రేటర్ ఒకటో డివిజన్ పరిధి పలివేల్పులలోని భగత్‌సింగ్ కాలనీ, ముచ్చర్లలో వర్ధన్నపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేశ్ గెలుపు కోసం ఒకటో డివిజన్ అధ్యక్షుడు నరెడ్ల శ్రీధర్ ఆధ్వర్యంలో గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గ్రామ అధ్యక్షులు పోతరబోయిన లోకేశ్, రాజ్‌కొమురయ్య, డివిజన్ ఉపాధ్యక్షుడు నాగరాజు, ఎస్సీ సెల్ గ్రామ అధ్యక్షుడు దయాకర్, మహిళా అధ్యక్షురాలు పూజారి అరుణ, సుజాత, జిల్లా నాయకులు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, పౌల్, పులెట్ల శ్రీధర్ ప్రభాకర్, సుధాకర్, రాయుడు, ప్రకాశ్, లత, అనిత, కవిత, కిరణ్ పాల్గొన్నారు. 3వ డివిజన్ పైడిపల్లిలో 124వ బూత్ కన్వీనర్, వరంగల్ పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ జన్ను రాజయ్య ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి బీఆర్ఎస్ సర్కార్ పథకాలను వివరించారు. జన్ను చెక్కర స్వామి, కిరణ్, రామచందర్, యాకుబ్, జన్ను రాజు, సురేశ్, అనిల్, మేకల చింటు, రవి, జన్ను సారంగపాణి పాల్గొన్నారు.

# దశాబ్దాల వెనుకబాటును తొమ్మిదేళ్లలో రూపుమాపాం

- కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించండి
- మరింత అభివృద్ధి చేసుకుందాం..
- బీఆర్ఎస్ అభ్యర్థి అరూరి రమేశ్
- పర్వతగిరి మండలంలో ఇంటింటా ప్రచారం


ఏనుగల్లులో రోడ్‌షోలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేశ్

పర్వతగిరి, నవంబర్ 16: ఆరు దశాబ్దాల వెనుకబాటును ఒక్క దశాబ్ద కాలంలోనే రూపుమాపామని బీఆర్ఎస్ పార్టీ వర్ధన్నపేట అభ్యర్థి అరూరి రమేశ్ తెలిపారు. మండలంలోని ఏబీ తండా, చింతనెక్కొండ, బట్టు తండా, తూర్పుతండా, గుగులోత్‌తండా, ఏనుగల్లు, మల్యాతండా, మూడెత్తుల తండా, శ్రీనగర్, కొంకపాక, గోపనపెల్లి, అనంతారం గ్రామాల్లో గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులు, మహిళలు, ప్రజలు డప్పుచప్పుళ్లు, కోలాటాలు, బతుకమ్మలు, మంగళహారతులతో అరూరికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఓట్లు అడిగే హక్కు కాంగ్రెస్ లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ చెప్పే వారెంటీ లేని గ్యారెంటీ హామీలను ప్రజలు నమ్మొద్దన్నారు. 60 ఏండ్ల కాంగ్రెస్ పరిపాలనలో తాగునీరు, కరెంట్, మౌలిక సదుపాయాలను ఎందుకు కల్పించలేకపోయిందో ప్రజలు ఒకసారి ఆలోచించాలన్నారు. ప్రస్తుతం ఆచరణకు సాధ్యం కాని హామీలతో ఓట్లు దండుకోవాలని చూస్తున్న కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. బాధ్యతాయుతమైన బీఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టోతో ప్రజలకు భరోసా అని తెలిపారు. కారుగుర్తుకు ఓటు వేసి తనను మరోసారి గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. ఎంపీపీ కమల పంతులు, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి కర్నెక్ల బాబురావు, పీఏసీఎస్ చైర్మన్ మోటపోతుల మనోజ్‌కుమార్‌గౌడ్, గొర్రె దేవేందర్, మార్కెట్ డైరెక్టర్ పట్టాపురం ఏకాంతంగౌడ్, సర్పంచులు ప్రమీలా, గటిక సుష్మా, సంధ్యారాణి, సుజాత, జ్యోతి లకుపతి, రమేశ్, మహేశ్, తౌటి దేవేందర్, పార్టీ మండల అధ్యక్షుడు రంగు కుమార్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు, పంతులు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బోయినపెల్లి యుగేందర్‌రావు, సీఏ కొయ్యల రాజు, మాజీ ఎంపీపీలు రంగు రజితగౌడ్, వల్లందాసు రంగయ్య, భాస్కర్‌రావు, మధుసూదన్‌రావు, ఎంపీటీసీలు మౌనిక, సుభాషిణి, లావణ్యారావు, బూక్య భాస్కర్, కర్నెక్ల మోహన్‌రావు, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు గూడ నరేందర్‌వర్మ, రైతు విభాగం మండల అధ్యక్షుడు బాల్య వెంకటరాజు గౌడ్ పాల్గొన్నారు. చింతనెక్కొండ, ఏనుగల్లు గ్రామాల్లో అరూరికి గజమాలతో ఘనంగా సత్కరించారు.

## కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి..

- గోపన పెల్లి, దౌలత్‌నగర్ ఎంపీటీసీల చేరిక
- గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే అరూరి

పర్వతగిరి/కాశీబుగ్గ, నవంబర్ 16: బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు కొనసాగుతున్నాయి. పర్వతగిరి మండలం దౌలత్‌నగర్ ఎంపీటీసీ మాలోత్ కాంతమ్మ (కాంగ్రెస్), గోపనపెల్లి ఎంపీటీసీ సూర రమేశ్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి వర్ధన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేశ్ గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ పరిశీలకుడు నాగుర్ల వెంకటేశ్వర్లు, సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ సూర అశోక్ పాల్గొన్నారు.

**ఎస్ఆర్ నగర్‌కు చెందిన 50 మంది పైగా..**

గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ ఎస్ఆర్ నగర్‌కు చెందిన 50 మంది కాంగ్రెస్ నాయకులు గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఏనుగల్లు శివారులోని శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయ సమీపంలో సమావేశంలో వర్ధన్నపేట బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి అరూరి రమేశ్ గులాబీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే అరూరి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతో ప్రజలు బీఆర్ఎస్‌ను విశ్వసిస్తున్నారన్నారు. చేరిన వారిలో ఎస్కే హఫీజ్, రమేశ్, శంషోద్దీన్, ఎండీ రబ్బానీ, షేక్ ఖదీర్‌తో పాటు 40 మంది ఉన్నారు. డివిజన్ అధ్యక్షుడు ముడుసు నరసింహా, నాయకులు కేతిరి రాజశేఖర్, అమ్మరాజు కుమార్, మచ్చర్ల స్టాలిన్, ఆడేపు అశోక్, ప్రభాకర్, బండ్ల సురేందర్ ఉన్నారు.


ఎస్ఆర్ నగర్ వాసులకు గులాబీ కండువాలు కప్పుతున్న అరూరి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఆర్ఐలు

# బీఆర్ఎస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి

- పార్టీ అభ్యర్థి అరూరి రమేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- ఎన్ఆర్ఐ సెల్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం

న్యూశాయంపేట, నవంబర్ 16: బీఆర్ఎస్‌తోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఎన్ఆర్ఐ సెల్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కూర్మాచలం అన్నారు. ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి అరూరి రమేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఎన్ఆర్ఐలు మద్దతు తెలిపారు. ఈ నేపథ్యంలో గురువారం హనుమకొండ హంటర్‌రోడ్డులోని వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్ధన్నపేట బీఆర్ఎస్ అభ్యర్థి అరూరి రమేశ్‌కు బాసటగా నిలుస్తామని, ఆయన గెలుపునకు కృషి చేస్తామని చెప్పారు. వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో తొమ్మిదిన్నర ఏండ్లలో సుమారు రూ.4వేల కోట్ల నిధులతో ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేశారని చెప్పారు. మరింత అభివృద్ధి కోసం కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అన్ని రంగాలను విస్మరించిన ప్రతిపక్షాలకు ఓటు వేస్తే అభివృద్ధి 50 ఏండ్లు వెనక్కుపోతుందన్నారు. కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా చూడాలన్నారు. ఎన్ఆర్ఐ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి కడుదుల రత్నాకర్, ఎన్ఆర్ఐ సెల్ యూఎస్ఏ నాయకురాలు బిందులత, ఎన్ఆర్ఐ నాయకులు కోరబోయిన విజయ్, నవీన్‌రెడ్డి, గొట్టిముక్కల సతీష్‌రెడ్డి, శానబోయిన రాజ్‌కుమార్, ప్రవీణ్, ఆకుల వినయ్ పాల్గొన్నారు.

## ఉపన్యాస పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

వర్ధన్నపేట, నవంబర్ 16: గాంధీ గ్లోబల్ ఫౌండేషన్, తెలంగాణ సోషల్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఉపన్యాస పోటీల్లో వర్ధన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని హిమబిందు ద్వితీయ బహుమతి సాధించింది. శంభునిపేటలోని ప్రభుత్వ పాఠశాలలో ‘మానవ జీవన విధానంలో ప్రకృతి పాత్ర’ అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీలల్లో జిల్లాలోని 25 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాలకు చెందిన డీ.హిమబిందు ద్వితీయ స్థానం సాధించింది.

## కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

పర్వతగిరి, నవంబర్ 16: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కల్లెడ పర్వతగిరి పీఏసీఎస్ సీఈఓ చింతకాయల సురేశ్ అన్నారు. గురువారం మండలంలోని సీకే తండా, మూడు తండా, ముంజాలకుంటతండా, బూరుగుమళ్ల, పెద్ద తండాలలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులకు అందుబాటులో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.